www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 ఆగస్టు 2023 5
ఏలూరు

ఐలు రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ఏలూరు: ఈనెల 12, 13 తేదీల్లో గుంటూరులో జరిగే ఐలు 12వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఐలు జిల్లా అధ్యక్షులు ఒరుగంటి శైలజ న్యాయవాదులను కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్లను ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒరుగంటి శైలజ మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 10 గంటల నుండి సభ ప్రారంభమవుతుందన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ హాజరవుతున్నారని తెలిపారు. రెండో రోజు సమయం ప్రముఖ జర్నలిస్టు తీస్తా సెతల్వాద్ ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు. మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కోర్టులకు చెందిన 500 మంది న్యాయవాదులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. ఐలు ఏలూరు కమిటీ కార్యదర్శి గెద్దా విజయభాస్కర్ మాట్లాడుతూ ఏలూరు కోర్టులో ప్రాక్టీస్ చేసే న్యాయవాదులు పది మంది ప్రతినిధులుగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిల్లెళ్లమూడి ప్రసాద్, ఏలూరు న్యాయవాదులు ఎం.శ్రీనివాసరావు, లక్ష్మి, జాన్సన్ పాల్గొన్నారు.

గురువుల వేతన రోదన..!

మూడు నెలలుగా అందని వేతనాలు
జిఒ 117 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకూ తప్పని తిప్పలు
హై స్కూల్ ప్లస్‌లో చేరిన పిజిటిలదీ అదే పరిస్థితి
ఉమ్మడి జిల్లాలో రెండు వేల మందికి అందని జీతాలు
గందరగోళంగా అధికారుల సమాధానం
చెల్లించకపోతే మరో ఆందోళనకు సిద్ధం : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి జిల్లాలో వేతనాల కోసం గురువులు గగ్గోలు పెడుతున్నారు. రెండు మూడు నెలల నుంచి జీతాలందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిఒ 117 ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హైస్కూల్ ప్లస్‌లో చేరిన పిజిటిలది కూడా ఇదే పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వేల మంది ఉపాధ్యాయులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే దీనిపై ఇటు ప్రభుత్వంగానీ అటు అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో పొంతనలేని సమాధానం చెబుతున్నారు. అయితే వివిధ కేటగిరిలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు తక్షణం జీతాలు అందించాలని లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామని యుటిఎఫ్ హెచ్చరిస్తుంది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా, అడుగుతున్న ఉపాధ్యాయులపై దౌర్జన్యానికి దిగి నిర్బంధాలు విధిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుంది.

ఇదిలా ఉంటే నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వవిద్యను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయుల హక్కులను కాలరాసే విధంగా పాలన కొనసాగిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 117 జిఒ ద్వారా మంజూరైన పోస్టులు ఉపాధ్యాయులు వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహిస్తున్నారు. విలీనం ప్రక్రియ ద్వారా కొత్తగా సృష్టించిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బదిలీపై చేరిన టీచర్లకు, జిల్లాలో ఎంపికచేసిన మండలాల్లో ఇంటర్ విద్యతో గతేడాది ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ (జెడిపి జూనియర్ కళాశాలలు)లో నియమించిన పిజిటిలకు, ఎంఇఒల కొత్తగా ఏర్పాటు చేసిన పోస్టుల్లో, హెచ్‌ఎంలు లేనిపోస్టుల్లో ఇలా వివిధ రకాల బదిలీల్లో వెళ్లి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు అందని పరిస్థితి ఏర్పడింది. రెండు మూడు నెలల నుంచి జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల బిల్లులను ఆమోదించడానికి జిల్లాస్థాయిలో ఇంతవరకూ ఖజానాశాఖకు రాష్ట్ర ఖజానా కార్యాలయం నుంచి సరైన వివరాలు అందకపోవడంతో జిల్లా విద్యాశాఖ మీద ఆరోపణలున్నాయి. ప్రభుత్వం కూడా కనీసం దృష్టి సారించట్లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఈ ఏడాది జూన్‌లో కొత్తగా ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలకు వివిధ సబ్జెక్టుల క్రియేట్ చేసిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులకు కూడా జీతాలు అందని పరిస్థితి తలెత్తింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో పెద్దసంఖ్యలోనే ఎస్‌జిటిలు మిగులు (సర్ ప్లస్) ఉపాధ్యాయులుగా ఉన్నారు. వం రో వై వ్ర ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాల్సి ఉండటంతో అర్హులైన ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించి కౌన్సెలింగ్ ద్వారా ఆయా యుపి స్కూళ్లల్లో గత నెలలో బదిలీపై నియమించారు. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్న పాఠశాలలకు బదిలీ అయిన టీచర్లకు జీతభత్యాలు చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు కానీ కొత్తగా క్రియేట్ చేసిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బదిలీపై చేరిన ఉపాధ్యాయులకే జీతాల చెల్లింపులో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో సాధారణ బదిలీల్లో ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులు దాదాపు రెండు వేల మందికి గత రెండు మూడు నెలల నుంచి జీతాలు అందని పరిస్థితి ఉంది.

సవాలక్ష సమస్యలు పొంతనలేని సమాధానాలు

కొత్తగా భర్తీ చేసిన పోస్టులను కేడర్ స్ట్రెంగ్త్‌లో చేర్చకపోవడం, చేర్చినా వాటిని రాష్ట్ర కార్యాలయంలో ఇంతవరకూ ఆమోదించకపోవడం వల్ల సంబంధిత టీచర్ల వివరాలు ఖజానాశాఖకు అందలేదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాల నుంచి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ (సిఎస్ఇ) కార్యాలయానికి చేరిన టీచర్ కేడర్‌ంగ్ వివరాల తుదిపరిశీలన జరుగుతోంది. ఆ తర్వాత వివరాలను సిఎస్ఇ ఆమోదించి రాష్ట్ర ట్రెజరీ కార్యాలయానికి పంపుతారు. ఆ తర్వాతే జిల్లా ఖజానా కార్యాలయానికి పంపిస్తారు. అప్పుడు మాత్రమే సంబంధిత టీచర్ల జీతాల బిల్లులను జిల్లాస్థాయిలో స్వీకరించి పరిశీలన అనంతరం ఆమోదిస్తే తప్ప జీతాలు అందే పరిస్థితి కనిపించట్లేదు. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం పొంతనలేని సమాధానం చెబుతున్నారు. జీతభత్యాలకు సంబంధించిన అన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం కూడా పట్టనట్టు వ్యవహరించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధ్యాయులు ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లాలో జీతభత్యాల కోసం సుమారు రెండు వేలమంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. రెండు నెలల నుంచి జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రుణాలకు ఇఎంఐలు, కుటుంబ పోషణకు సమయానికి జీతాలందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా భర్తీ చేసిన పోస్టులు, బదిలీల్లో జరిగిన అవకతవకలు, ఉపాధ్యాయులపై కక్షపూరిత చర్యల కారణంగా వివిధ కేడర్లలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీతాల్లేక ఇబ్బంది పడుతున్నాం

బి.శ్రీనివాసరావు, పిజిటి ఉపాధ్యాయులు, పాలకోడేరు

నూతనంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లో ఈ ఏడాది మే 22న పిజిటి ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాను. గ్రామాల్లో ప్రతీ ఇంటికి తిరిగి విద్యార్థినులను సమీకరించి ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేస్తున్నాము. మూడు నెలల నుంచి జీతాలు అందడం లేదు. ఆర్థికంగా నానా అవస్థలు పడుతున్నాను. వివిధ గృహరుణాలు ఇతరత్రా రుణాముల చెల్లింపులకు తీవ్ర అంతరాయం కలిగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాను. ప్రభుత్వం స్పందించి మా జీతాలు మాకు ఇప్పించండి.

ఆందోళన చేపడతాం

బి.గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి



117 జిఒ తీసుకొచ్చి జిల్లాలో వివిధ రకాలుగా బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియ వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి ప్రభుత్వం జీతాలివ్వడం లేదు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటికే జీతాలు చెల్లించాలని రెండు విడతల్లో ఆందోళనలు చేపట్టాము. ఈ నెల 12న 12 గంటల పాటు నిరసన కూడా తెలుపుతున్నాం. ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

మాత్రల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న అధికారులు

ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ తప్పనిసరి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏడాదికి రెండుసార్లు పిల్లల చేత అల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా వారిలో రక్తహీనత, పోషకాహారలోపాన్ని తొలగించవచ్చని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఏలూరులోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంట పద్మజ ప్రసాద్, జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశ, డిఇఒ శ్యామ్‌సుందర్, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ మానసతో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు లక్షల 536 మందికి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. పిల్లల్లో అత్యధిక శాతం రక్తహీనత లోపం వల్లే ఎక్కువ అనారోగ్యాలకు గురవుతున్నారని, ప్రతీ ఆరు మాసాలకు ఒకసారి నులిపురుగు మాత్రలు తీసుకోవడం ద్వారా రక్తహీనత లోపాన్ని అధిగమించడంతో పాటు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల శరీరంలో నులిపురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల ఆక్సిజన్, హిమోగ్లోబిన్ శాతం తగ్గి, తరచుగా అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకునే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి భాస్కర్ రావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.స్రవంతి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు మరిన్ని రాయితీలు

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - లింగపాలెం

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను వినియోగించుకుని అత్యధిక ఉత్పత్తులు సాధించడంలో రైతులు ముందంజలో ఉండాలని కలెక్టరు ప్రసన్న వెంకటేష్ కోరారు. గురువారం ముడిచర్లలో ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజాతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రైతులకు పామాయిల్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు, ఎంఎల్‌ఎ కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే ఏలూరు జిల్లా పామాయిల్ పంట పండించడంలో మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 7,100 హెక్టార్లలో ఈ పంట విస్తరించాలని లక్ష్యంగా తీసుకొని 7,265 హెక్టార్లకు పరిపాలనా ఆమోదం అందించామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ 1054 హెక్టార్లలో ప్లాంటేషన్ చేపట్టామన్నారు. పెదవేగి మండలం రామసింగవరంలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ నర్సరీ, ప్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో చింతలపూడి నియోజకవర్గంలో ఈ పంట విస్తీర్ణం అధికమని, దీనిలో లింగపాలెం మండలంలో రైతులు ఎక్కువగా ఈ తోటలు వేశారన్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు ఎక్కువన్నారు. వీటిని రైతులకు సకాలంలో అందించే చర్యలపై ఎప్పటికప్పుడు శ్రద్ధచూపుతున్నామన్నారు. ఈ పంట వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ ఉద్యాన వన పంటల్లో పామాయిల్ లాభదాయకమైనదన్నారు. అంతర్జాతీయంగా తలెత్తే పరిణామాల వల్ల ధరల్లో హెచ్చుతగ్గులుంటాయని, అలాంటి సమయంలో రైతులు నిరాశ చెందొద్దని కోరారు. ఇది లాభదాయమైన పంట అని వివరించారు. ఈ సందర్భంగా పామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్, ఎంఎల్‌ఎల దృష్టికి తీసుకువచ్చారు. సకాలంలో మొక్కలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు సకాలంలో ఇప్పించాలని కోరారు. ఈ విషయంపై అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డిడి రామ్మోహన్‌రావు, గ్రామ సర్పంచి రావి రమాదేవి, ఎఎంసి ఛైర్మన్ జానకిరెడ్డి, మండలస్థాయి నాయకులు, అధికారులు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పేదలు

సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న ఎఎస్‌ఆర్‌నగర్ వాసులు సాగు చేసుకుంటున్న సర్వే నెంబర్ 86లో సాగుభూమికి పట్టాలివ్వాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళీ మాట్లాడుతూ కృష్ణాపురంమెట్టలో 2010 నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి, మైనార్టీలకు చెందిన పేదలు సర్వే నెంబరు 86లో మినుములు, కందులు, పత్తి వంటి పోడుసాగు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అసైన్మెంట్ సవరణ ఆర్డినెన్స్ సాగులో ఉన్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎఎస్‌ఆర్ నగర్‌కు మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమారి, బరగడ కుమారి, బూదెమ్మ ఉన్నారు.

వార్డు సభ్యుని ఉపఎన్నికకు సిపిఎం అభ్యర్థుల నామినేషన్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పంచాయతీలోని వార్డు ఉప ఎన్నికల్లో భాగంగా ఆరోవార్డుకు సిపిఎం నుంచి సోయం కన్నమ్మ, కెచ్చెల రమణ గురువారం నామినేషన్లు దాఖలు చేసినట్లు సిపిఎం మండల కమిటీ నాయకులు నెలటూరి అప్పారావు తెలిపారు. అభ్యర్థులు పార్టీలో చురుగ్గా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతో వీరితో నామినేషన్ వేయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి నెలటూరి నిర్మల, నాయకులు నల్ల భీమశంకరం, కొడమంచిలి చిరంజీవి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆర్‌డిఒ జాన్సీరాణి తెలిపారు. జీలుగుమిల్లి తహశీల్దార్ కార్యాలయన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఆర్‌డిఒ లాగిన్‌లో రెండు స్పందన ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణకు వచ్చినట్లు తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది క్షేత్ర స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలో రీ సర్వే పనులు నత్త నడకన సాగుతున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది రీ సర్వే పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్ సింగ్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ జాన్సీరాణి

12న ఫ్యాప్టో 12 గంటల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధ్యాయుల, పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న 12 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిబివిఎన్‌ఎల్.నారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రం గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యారంగం సంక్షోభంలో పడిందని, ప్రభుత్వం శాస్త్రీయమైన విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలల నుంచి నాలుగు లక్షల మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ప్రయివేటు పాఠశాలలకు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన జాతీయ విద్యావిధానం, మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల్లేక తరగతి గదులు వెలవెలబోతున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను భయాందోళనలకు గురి చేస్తున్నారని విమర్శించారు. సిఎం జగన్ సిపిఎస్ రద్దు చేస్తామని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిషనర్ మన్మోహన్ సింగ్ ఇప్పటి వరకూ నెలరోజులు గడిచినప్పటికీ ఛార్జి తీసుకోలేదని, తక్షణం మార్కెట్ ధరలకు అనుగుణంగా 50 శాతం మధ్యంతర భృతితో పిఆర్‌సి ప్రకటించాలన్నారు. ఆదర్శ పాఠశాలలకు 010 హెడ్ జీతాలు, ఉద్యోగోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, కస్తూరిబా పాఠశాలలో ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేసి 30 శాతం వేతనాలు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు భవిష్య నిధి, ఆరోగ్య కార్డులు, మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 60 వేల మంది ఉపాధ్యాయుల రెండు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సర్వీస్ రూల్స్ ఆమోదింపజేసి ఉద్యోగోన్నతులు, బదిలీలు నిర్వహించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ పోరాటం

ఆవిర్భావ వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

జెండా ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో పూర్వపు జిల్లా కోశాధికారి, విశ్రాంత ఉపాధ్యాయులు జివి.సురపురాజు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి నాళ్లల్లో సంఘం అవసరం చాలా ఉండేదని, అదే పరిస్థితి ఇప్పుడు మళ్లీ కనిపిస్తుందని, సంఘాలు లేకపోతే ఉపాధ్యాయుల మనగడే ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నడిపించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముస్తఫా అలీ, ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కార్యదర్శి శివశంకరరావు, జిల్లా కన్వీనర్ మోహన్‌రావు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎంతోమంది ఉద్యమ నాయకులు వారి జీవితాన్ని సంఘం కోసం అంకితం చేసిన ఫలితంగానే ఈరోజు అగ్రగామి సంఘంగా నడుస్తోందన్నారు. జిల్లా అధ్యక్షులు ముస్తఫా అలీ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ ఫ్యాఫ్టో ఆధ్వర్యంలో జరిగే 12 గంటల ధర్నాను విజయవంతం చేయడానికి యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్ర సంఘం నుంచి ఇచ్చే ప్రతి కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నడుపుతున్న జిల్లా కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి శివశంకర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఉంగుటూరు : నారాయణపురంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ నాయకులు ఉప్పిలి వెంకటేశ్వరరావు, కలిగట్ల శ్రీరామకృష్ణ యుటిఎఫ్ పతాక ఆవిష్కరణ చేశారు. గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందుంటుందన్నారు. ఉపాధ్యక్షులు హరికృష్ణ, ఆడిటర్ శ్రీధర్, సీనియర్ నాయకులు అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు, గొల్లపల్లి రామారావు, ప్రేమ్ కుమార్, లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, వర్మ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :1974లో ఏర్పడిన యుటిఎఫ్ అనేక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తూ విజయవంతంగా 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు అన్నారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక యుటిఎఫ్ భవనం వద్ద ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 49 సంవత్సరాలుగా యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగం రక్షణకు, ఉపాధ్యాయులు సంక్షేమం కోసం పనిచేసిందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు యుటిఎఫ్ లక్ష్యాలైన అధ్యయనం, అధ్యాపనం, సామాజికత కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మహమ్మద్ నభి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు షేక్ తడాహికో, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, ఎం.మురళీ మోహన్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న యువకులు

రోడ్లకు మరమ్మతులు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

అధ్వానంగా ఉన్న కామవరపుకోట - చింతలపూడి రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ మండలంలోని రాజుపోతేపల్లిలో యువకుడు గురువారం రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో చింతలపూడి - కామవరపుకోట రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయన్నారు. వర్షం పడితే ఆ గుంతలు చెరువులను తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్లపై ఉన్న గోతుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలమైన రోడ్లను పునరుద్ధరించి ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు నాగదేశి అరుణ్, రహీమ్, నిమ్మ రాంబాబు, సుధాకర్, కొరప్రోలు కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలపై 14న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన పేదలకు చెందిన అన్ని రకాల భూ సమస్యలపై జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేస్తామని ప్రకటించి అసైన్‌మెంట్ భూముల చట్ట సవరణ చేయడం దుర్మార్గమన్నారు. 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకపోగా ఈ చట్ట సవరణ ద్వారా 20 ఏళ్లు ఎవరైతే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో వారికే పట్టాలు ఇస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. కాకులను కొట్టి గెద్దలకు పెట్టినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పేదల చేతుల్లో ఉన్న భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎర్ర కాల్వ మిగులు భూములు పేదలకు, దళితులకు, గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 30 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా భూములమ్మేసిన భూస్వాములే సాగు చేస్తున్నారన్నారు. చట్ట విరుద్ధంగా రెవెన్యూ శాఖ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు పేదలకు అన్యాయం చేస్తూ భూస్వాములు ఇచ్చే లంచాలు తీసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్ల క్రితం ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు కోసం ఇప్పటి ప్రభుత్వం సుమారు 3500 ఎకరాలు భూసేకరణ చేసిందన్నారు. ఈ భూముల్లో సుమారు 3000 ఎకరాలు మిగులుగా ఉందని, ఆ భూములు ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పేదలకు సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. దీంతో పాటు ఎక్ సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న వారిపైన ఇరిగేషన్ అధికారులు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న భూసాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, నూజివీడు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పేదల భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. ఆక్రమించుకున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల భూ సమస్య పరిష్కారం కోసం జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భూ సమస్యలు ఉన్న ప్రతి గ్రామం నుంచి పేదలు పెద్ద ఎత్తున తరలిరావాలని, వారి సమస్య పరిష్కారం కోసం వ్యక్తిగతంగా కలెక్టర్‌కు అర్జీలు పెట్టుకోవాలని తెలిపారు.

ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వక్తలు

విద్యార్థులు మహనీయుల త్యాగాలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

స్వతంత్ర పోరాటంలో మహనీయుల త్యాగాలు ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సుబ్బమ్మదేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.కుటుంబరావు అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం తరపున తొమ్మిదో తేదీ నుంచి 15వ తేదీ వరకు విద్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 12వ తేదీ పోటీల ఫ్లెక్సీని సుబ్బమ్మ దేవి హైస్కూల్ హెడ్‌మాస్టర్ కుటుంబరావు ఆవిష్కరించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ 9, 10, 11 తేదీల్లో హైస్కూల్, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 12వ తేదీన హైస్కూల్ విద్యార్థులకు ఉపన్యాస పోటీ కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు సుబ్బమ్మ దేవి హైస్కూల్లో నిర్వహిస్తామని, ఈ పోటీలకు హైస్కూల్ నుంచి ముగ్గురు చొప్పున, కాలేజీ నుంచి గ్రూపునకు ముగ్గురు చొప్పున రెండు గ్రూపులు పాల్గొనవచ్చన్నారు. విజేతలందరికీ 15వ తేదీన సీతారామ భర్తీయా కళ్యాణ మండపం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించే సభలో బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద, ఉపాధ్యాయులు ఆర్‌విఆర్‌కె.వరప్రసాద్, కె.శ్వేత, ఎన్.లీలాకుమారి, పి.గోపాల్ పాల్గొన్నారు.

యనమదలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని యనమదల గ్రామంలోని సచివాలయం వద్ద సొసైటీ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా మాట్లాడుతూ డాక్టర్ సిరిపురపు కేశవరావు సంస్మరణార్థం నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆరు క్యాంపుల ద్వారా 1200 మందికి పైగా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

ముసునూరులో...

పాఠశాలలో 'నాదేశం-నాభూమి'

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులోన శ్రీసాయి గీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నా దేశం - నాభూమి కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ జి.మధుప్రియ తెలిపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంపిడిఒ జి.రాణి, జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల్లో నా దేశం - నా భూమి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు

చాట్రాయి : మండలంలోని చిత్తపూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో నా భూమి నాదేశం శిలాఫలకాన్ని గ్రామ సర్పంచి తిరివీధి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్రం కోసం పోరాడి తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామ కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ, ఎన్ఆర్ఇజిఎస్ ఎఫ్ఎ.రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేతలు

వైవాకలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి నియోజకవర్గ నాయకులు కొడాలి వినోద్ గురువారం రెండో రోజు మండలంలోని వైవాకలో పర్యటించారు. పార్టీ వైవాక అధ్యక్షులు నగుళ్ల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ గ్రామంలోని ఇంటింటికి తిరిగి టిడిపి ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో దాకరం గ్రామ సర్పంచి జాస్తి రాఘువేంద్రరావు, పార్టీ నాయకులు బత్తుల రవి, పంతగాని సురేష్, కె.సుబ్బరాజు, పాముల జోసఫ్, తంబి, కె.పద్మ, లక్ష్మీనరసింహస్వామి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వృద్ధురాలిపై దాడి : ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని టి.గుడుపాడు గ్రామంలో ఈ నెల ఏడో తేదీన వృద్ధురాలిపై దాడి చేసిన వారిని ఎస్ఐ కెసిహెచ్.స్వామి గురువారం అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజర పర్చారు. వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. వివరాల ప్రకారం... టి.గుడుపాడు గ్రామానికి చెందిన శ్రీకాకొల్లు జోజికి చెందిన చెట్టుకొమ్మలు విరిగి పక్కనే నివాసం ఉంటున్న వృద్ధురాలు ఆడిమిల్లి లూర్దమ్మ ఇంటిపై పడి రేకులు పగిలిపోయాయి. మళ్లీ యధావిధిగా రేకులు వేయమని పెద్దలు చెప్పారు. కాలం గడుస్తున్నా రేకులు వేయకపోవడంతో రేకులు వేయమని అడగడంతో జోజి ఆయన భార్య శ్యామల వృద్ధురాలిపై దాడి చేశారు. ఆమెను 108లో నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సిద్ధార్థ నగర్ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34.50 వేల నగదు, ఎనిమిది బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పూర్వ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి (కోరు మాస్టారు) సంస్మరణార్థం వారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న కోరు మాస్టారు స్మారక ప్రతిభా పురస్కారాలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పురస్కార గ్రహీతలకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమడోలు పూర్వపు సమితితోపాటు, అనంతరం కొనసాగిన మండల వ్యవస్థలో ఉపాధ్యాయులుగా కొనసాగిన కోరు మాస్టారుగా గుర్తింపు పొందిన కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి విద్యావ్యాప్తికి, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలు ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్న వారి కుమారులు పుణ్యమూర్తి, సుబ్రమణ్యం అదే ఒరవడిని కొనసాగించే క్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరై పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్న విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు షీల్డ్‌లను అందించి వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా గత విద్యా సంవత్సరం నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానం దక్కించుకున్న విద్యార్థులు కె.రితికకు రూ.ఐదు వేలు, ఎల్.వినూత్నకు రూ.నాలుగు వేలు, వెజ్జు పవన్‌కు రూ.మూడు వేలు నగదు పురస్కారాలతో ప్రతిభా పురస్కార షీల్డులను అందించారన్నారు. దీనికి అదనంగా అప్పట్లో కోరు మాస్టారుతో పని చేసిన సమకాలీన ఉపాధ్యాయులు, ప్రస్తుతం విశ్రాంత ఉపాధ్యాయులుగా ఉన్న సన్నిపల్లి వసంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.శ్రీనివాసరావును సత్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కఠారి వీర వెంకట సత్యనారాయణ (బాబూరావు), ఎన్ఆర్ఐ, పాఠశాల పూర్వ విద్యార్థి పూజారి రాకేష్, పాఠశాల ఉపాధ్యాయులు అనీల్, అహమ్మద్ కోరు మాస్టారు స్మారక ప్రతిభా పురస్కార అవార్డు విజేతలను అభినందించారు.

పూర్వ విద్యార్థులతో కోరు మాస్టారు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు

13న నారాయణపురం కాలేజీలో పూర్వ విద్యార్థుల సదస్సు

గోల్డెన్ జూబ్లీకి ఏర్పాట్లు చేస్తున్న కళాశాల సిపిడిసి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఎస్ఎఎస్) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలతో పాటు, పూర్వవిద్యార్థుల సమ్మేళనం, శ్రీఅరవిందుని 150వ జయంతి కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈపూరి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం కాలేజీలో సమాయత్త ఏర్పాట్లపై సమీక్షించారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో కాలేజీ ప్రాంగణంలో అరవిందు, పొట్టి శ్రీరాములు, మహాత్మ గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు సోదరులు వితరణ చేశారు. పైలాన్ నిర్మాణానికి పూర్వ విద్యార్థి, సిఐ ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఆర్ఒ తాగునీటి పథకానికి వేగేశ్న రంగరాజు ఆర్థిక సాయం ప్రకటించారు. ఇంకా చాలా మంది పూర్వవిద్యార్థులు కళాశాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి సాయం అందించానికి ముందుకురావడం అభినందనీయమని ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు అన్నారు. 12వ తేదీన పైలాన్, అరవిందు, గాంధీ విగ్రహాలను ఆవిష్కరణ అనంతరం సమావేశం నిర్వహించనున్నారు. 13న ఈ కాలేజీలో వివిధ రంగాల్లో స్థిరపడిన, పూర్వవిద్యార్థులతో అపూర్వ సమ్మేళనానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఈపూరి సత్యనారాయణ వెల్లడించారు. గోల్డెన్ జూబ్లీకి సంబంధించి బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి అప్పారావు, శ్రీరామకృష్ణ, విజయకుమార్, గుణ్ణం బుల్లెబ్బాయి, కూన అప్పారావు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వక్తలు

సర్పంచి, వార్డు సభ్యుల పదవికి నామినేషన్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు గ్రామ పంచాయతీ సర్పంచి పదవికి జరగనున్న ఎన్నికకు సంబంధించి గురువారం తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ జరీనా తెలిపారు. మండలంలోని పెయ్యేరు పంచాయతీ రెండో వార్డు సభ్యుని ఎన్నికకు సంబంధించి మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రత్నసునందా తెలిపారు. 11వ తేదీ నామినేషన్ల పరిశీలన జరగనుంది. వైసిపి బలపరచిన అభ్యర్థిగా చిన్నం సుగుణబాబు, పార్టీ నేతలతో కలిసి వెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు.

ముసునూరు :మండల కేంద్రమైన ముసునూరులో వార్డు మెంబర్ పోటీకి టిడిపి, వైసిపి అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు పోలింగ్ రిటర్నింగ్ అధికారి కోటగిరి మురళీ తెలిపారు. ముసునూరు 11వ వార్డు మెంబర్ పోటీకి టిడిపి అభ్యర్థిగా కలపాల నలోమియా, వైసిపి అభ్యర్థిగా వనిత, డమ్మీ అభ్యర్థిగా బుల్లా నిర్మల నామినేషన్ పత్రాలు అందించినట్లు తెలిపారు. కాట్రేనిపాడులో పదో వార్డుకు టిడిపి తరపున ఇద్దరు అభ్యర్థులు, వైసిపి తరపున ఇద్దరు అభ్యర్థులు నాలుగు నామినేషన్లు అందించారు. వేల్పుచర్ల పదో వార్డుకు వైసిపి తరపున ఒక అభ్యర్థి మాత్రమే నామినేషన్ వేసినట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం :మండలంలోని శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ సర్పంచి ఎన్నికకు గురవారం నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి తరపున యడ్లపల్లి రాధిక, యడ్లపల్లి సత్యవతి, టిడిపి తరపున జొన్నకూటి శ్రీనివాసరావు, తడికల మోహనబాబు నామినేషన్లు వేశారు. అభ్యర్థులు నామినేషన్ల పత్రాలను శ్రీనివాసపురం సచివాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.సురేష్‌కి అందించారు.

ముదినేపల్లిలో నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు

విద్యతోనే సమగ్ర అభివృద్ధి

ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు

విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని అన్నారు. 107వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక 13వ డివిజన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. అన్ని పాఠశాలలోనూ ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో సిబిఎస్‌సి సిలబస్‌తో జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తొలుత స్థానిక కూడలిలో బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, స్థానిక కార్పొరేటర్ నీరుకొండ అన్నపూర్ణ నరేంద్ర, కమిషనర్ వెంకటకృష్ణ, తహశీల్దార్ సోమశేఖరరావు, డిప్యూటీ మేయర్ సుధీర్ బాబు, వైసిపి నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, బంకపల్లి రాజు, సుంకర చంద్రశేఖర్, తుమరాడ స్రవంతి పాల్గొన్నారు.

వింజరం సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించే సంకల్పంతో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిందని, వినూత్నమైన మార్పులు తీసుకొచ్చిందని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో వింజరం పంచాయతీ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. సచివాలయంలో నిర్మించిన అన్ని గదులను పరిశీలించారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ ఆదేశాలను, నియమాలను అందరూ తప్పకుండా అనుసరించాలని, సేవల్లో పారదర్శకత పాటించి ప్రజలకు సకాలంలో పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వింజరం పంచాయతీ ప్రెసిడెంట్ కె.వెంకటలక్ష్మి, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, వైస్ ఎంపిపి మీడియం సింగరాజు, వైసిసి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, పోలవరం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కోరసిక శ్రీను, ఇటుకలకోట ఎంపిటిసి మాజీ సభ్యులు గంగాచలం పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

మిల్క్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా శివజ్యోతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామపం చాయతీ శివారు వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన శనగల వెంకట శివ జ్యోతి కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సొసైటీ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా డైరెక్టర్ విభాగంలో ఎవరూ పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల శివజ్యోతి కి పాల ఉత్పత్తిదారులు, సొసైటీ ఉద్యోగులు, అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. పాల ఉత్పత్తిదారులందరికీ శివజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

మండవల్లిలో...

ప్రజాశక్తి - భీమడోలు

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా విద్యార్థులు జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి కోరారు. భీమడోలు మండల స్థాయిలో నులి పురుగు నిర్మూలనకు సహకరించే ఆల్బెండొజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని భీమడోలు హైస్కూల్లో గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ పాల్గొన్నారు. అతిథులుగా స్వచ్ఛంద సేవా సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్, వైసిపి ప్రముఖులు టి.రంగా పాల్గొన్నారు. విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఎస్.శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వారికి ఆల్బెండొజోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుండు గొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 44 అంగన్‌వాడీ కేంద్రాలు, 40 పాఠశాలలు, ఐదు కాలేజీల్లో 11,016 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయటం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది నవీన్, రామకృష్ణ, చంద్రకళ మురళి పాల్గొన్నారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ బిల్లల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు లీలా ప్రసాద్, కళ్యాణమహేశ్వరి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 29 పాఠశాలలు, 33 అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,269 మంది పిల్లలకు మాత్రలు వేయటం లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు.

చాట్రాయి : మండలంలోని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి దామెర ఉష చేతుల మీదుగా వైద్యాధికారి విజయలక్ష్మి విద్యార్థులకు నులిపురుగు నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. బూరుగుగూడెం పాఠశాలలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి విద్యార్థులకు నులి పురుగు నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు మండల విద్యాశాఖాధికారి బ్రహ్మచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థి దశ నుంచే చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులు దరిచేరవని సర్పంచి మెండ జాన్సీ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగులు సంక్రమిస్తే ఆకలి మందగిస్తుందని, రక్తహీనత ఏర్పడుతుందని, కడుపులో నొప్పి, వాంతులు, తల తిరగడం, మానసిక ఎదుగుదల లోపం తదితర లక్షణాలు కనిపిస్తాయస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్-ఎస్‌జి.ప్రసాద్, మెండ సురేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి :నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని గురజ, దేవపూడి ముదినేపల్లి పిహెచ్‌సిల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

చింతలపూడి :శరీరంలో ఉండే నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత సమస్యను పరిష్కరించవచ్చుని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కె.అబ్రార్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని ప్రగడవరం జెడ్‌పి హైస్కూలులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్రార్‌హుస్సేన్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పి భరత్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పెట్టా వేణు, తూము రమేష్, రాణి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ డి.గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ మాత్రలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ శ్రీనివాస్ రాజు, హెచ్‌ఎం రాజు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'అవగాహన లేమిగా ఎంఎల్ఎ ఎలిజా మాటలు'

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా మాటలు ఆయన అవగాహన లేమిని సూచిస్తున్నాయని సిపిఐ మండల సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముడిచెర్ల గ్రామంలో రైతులకు డ్రిప్పు పరికరాలు ఇస్తున్న సందర్భంలో కలెక్టర్‌తో పాటు ఉన్న ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ పామాయిల్ చాలా లాభదాయకమైన పంటని, రైతులకు టన్నుకు రూ.పది వేలు వచ్చిన లక్షాధికారులు అవుతారని అన్నారు. పామాయిల్ పంటకు పెట్టుబడి, ఎరువులు, కూలీల పెట్టుబడి, వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడి తగ్గటం, అనేక వ్యాధులు పామాయిల్ చెట్లకు రావటం ఇవేవీ తెలియని ఎంఎల్ఎ రూ.పది వేలు లక్షాధికారులవుతారని చెప్పటం హాస్యాస్పదమన్నారు. గత ప్రభుత్వంలో పామాయిల్ మొక్కలు రూ.20కి ఇస్తే ఈ ప్రభుత్వంలో రూ.193కు ఇస్తున్నారన్నారు. పామాయిల్ రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

'చంద్రబాబుపై అక్రమ కేసులు తగవు'

ప్రజాశక్తి - కైకలూరు

చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని టిడిపి పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి జాని అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు త్రినాథ్‌రాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పైడిమర్రి మాల్యాద్రి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటిలింగంబాబు, రాష్ట్ర యాదవ సాధికారిక కార్యదర్శి తలారి రాజేష్, నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఈదా వెంకటస్వామి, తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చక్కా పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని అమర్భవన్ ఆవరణలో ఎంఆర్‌పిఎస్ ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాట్లాడుతూ ఎస్‌సిల్లో 59 ఉప కులాలు ఉన్నందున దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు పొందేందుకు వర్గీకరణ తప్పనిసరిగా చేయాలన్నారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సమన్వయంతో అవిశ్రాంత కృషి, పోరాటం చేస్తున్నట్లు వివరించారు.

వైసిపి హయాంలో మహిళలకు రక్షణ కరువు : బొరగం

ప్రజాశక్తి - పోలవరం

ప్రస్తుత వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని జగన్నాథపేట, కొత్తపేటలో గ్రామాల్లో గురువారం నిర్వహించిన మహాశక్తి చైతన్యయాత్ర, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలో మహిళల కోసం పెట్టిన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తుందన్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తామని, అన్నివర్గాల ప్రజలు జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కుంజం సుభాషిణి, ఆకుల అరుణ, పెండ్యాల రమాదేవి, వల్లభనేని చిన్నారి, తెల్లం లక్ష్మీదుర్గ, బొమ్మా చిలకమ్మ, పోతుల శ్రీనివాసరావు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు కుంచె దొరబాబు, పాదం ప్రసాద్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు పిల్లి నాగరాజు, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు కుంచె రాజేష్, జల్లేపల్లి నరసింహరావు, ఆకుల రాజా, సున్నం సుధీర్, మజ్జి అప్పారావు, ఎడ్ల వినోద్, రెల్లి నాగబాబు పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో పట్టణ సిఐ మూర్తి వాహన చోదకులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేనిదే బైకు నడపరాదన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

పాస్‌పోర్టు పోయినది

POKURI VAISHNAVI, W/o. Pokuri Sridhar, అను నాకు భీమవరం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.18-10-2022న W5291206 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు ది. 09-08-2023వ తేదీన జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి ఏలూరు 1 టౌన్ కుండి సెంటరు వద్దకు వచ్చే సరికి నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.

POKURI VAISHNAVI
W/o. Pokuri Sridhar, H.No. 6C-6-5,
దక్షిణపు వీధి, ఏలూరు-534001